● కథానిక

# దాహం

**కాలువ మల్లయ్య**



**విశాలంగా పరుచుకొనున్న చింతచెట్టు... చెట్టు నీడలో ఇద్దరు నడివయస్కులు పడుకొనున్నారు... ఊడిపోతున్న నెక్కర్లను పైకెగదోసుకుంటూ పిల్లలు గోలీలాడుకుంటున్నారు. వాళ్ళ ముక్కుల్లోంచి చీమిడి కారుతోంది.. పచ్చిపచ్చిగా ఉన్న తుమ్మపొరక, పూర్తిగా ఎండని పేడముద్దలతో పొయ్యంటుబెట్టడానికి సతమతమవుతున్నారాడవాళ్ళు... ఉఫ్ ఉఫ్‌మని గొట్టంతో పొయ్యూదుతుంటే వాళ్ళ కళ్ళవెంట నీళ్ళొస్తున్నాయి. ఆ స్త్రీల శరీరాలపై చిరిగి మాసికలు పడ్డ గుడ్డపీలికలున్నాయి... తలపై చింపిరెంటుకలున్నాయి..**

వాళ్ళకొంచెం దూరంలో కూర్చొనున్న రాజమల్లు లేచి నిల్చున్నాడు. చెట్టు మొదట్లో ఉన్న ఓ 'జోలె'ను తీసి జబ్బకేసుకున్నాడు. అందులోంచి జగ్గనుతీసి చేతిలో పట్టుకున్నాడు.. మరో చేతిలో కట్టెపట్టుకున్నాడు.. ఆరుపదుల వయసు భారాన్ని మోస్తున్న రాజమల్లు తలపై రుమాలుంది. మొలకు కుప్పనవు అంచు ధోవతుంది.. కుడిచెవికి బంగారు కొనుక పోగుంది.. కుడి చేతికి వెండిపొంచు, దండ కడియమున్నాయి..

లయబద్ధంగా జగ్గూపాడు రాజమల్లు.. కాళ్ళకు చెప్పలేసుకొని తూర్పుదిక్కు చూశాడు.. పెద్ద పెద్ద బంగ్లాలతో పారిశ్రామిక కాలనీ గంభీరంగా కనబడింది.. రాజమల్లు కళ్ళు మెరిశాయి. మిగతా మూడువైపులా ఆతడెరిగిన పల్లెటూళ్ళే...

"నేనూళ్ళోకి పోయొస్త.."

"ఇప్పడెందుకే నాయన్న.. సాయంత్రం మేంబోతం... నువ్వుండు.." లేచి కూర్చుంటూ అన్నాడు రాజమల్లు పెద్దకొడుకు...

"ఇక్కడ ఈగలు గొట్టుకుంట కూసుండన్నా..! మీ రిష్టమున్నప్పడూళ్ళూళ్ళకు పోండ్రి.. నేనా బంగ్లాలున్న ఊరికి పోత... అక్కన్నే తింట.." అని బయల్దేరాడు రాజమల్లు..

'ఆ బంగ్లాల్లో దొరలుంటరు.. దాతలుంటరు.. చదువుకున్నోల్లుంటరు.. దానకర్ణులుంటరు.. పెద్ద పెద్ద నౌకరిగాల్లుంటరు.. ఈ రోజు బాగానే దొరుకుతయి.. మురిసిపోతూ కాలనీ దిక్కు నడుస్తున్నాడు రాజమల్లు.

"ఓ రాజన్నల రాజమల్లూ..!" పిలుపు విని నిల్చున్నాడు.. ఇంతలో ఓ మనిషొచ్చి అతని దగ్గర నిల్చొని పలుకరింపుగా నవ్వాడు.

"నువ్వా కొండయ్య పటేల..? ఎవ్వలో అనుకున్న.." నమస్కరించాడు రాజమల్లు..

"బాగున్నావా రాజమల్లు..? ఎన్నేండ్లాయె మేరిటురాక.."

"పది పన్నెండేండ్లాయె మేమిటురాక.. అప్పడుగా బంగ్లాలు కడుతున్నారు.."

"ఎడ్లబ్యారం నడుస్తలేదా రాజమల్లు.."

"నాకు తెల్సిన పని కోడెల బ్యారమొక్కటేనాయె. ఇప్పడది బాగ నడుస్తలేదు.. ఎట్ల నడుస్తది పటేల..? భూములు దున్నటానికి ట్రాక్టర్లు వాడబట్టిరి..

బంతులు గొట్టుటానికి మిషిన్లు రావట్టె... వడ్లు తూర్పార పట్టుటానికి గాలి పంకలచ్చె... మంగమా ఎడ్లను కొనుడు, అమ్ముడు మునుపటి తీరుగ ఎట్ల నడుస్తది...? అందుకే మాకొచ్చిన కథలు చెప్పమంట అడుక్కుంటున్నం..."

రాజమల్లు ముఖంలో విచారాన్ని గమనించాడు కొండయ్య...

"నువ్వన్నది నిజమే కనెటో పోతున్నవు...?"

"నా చేతిల జగ్గుంది గద... శివుని ఢమరుకమిది... ఇదే నాకు బతుకుదెరువు... బంగ్లాలున్న ఆ ఊరికి పోతున్న..."

అది పట్నమసోంటూరు. అందరు సదువుకున్నోల్లే... నౌకరీగాల్లే... అటేంబోతవు కని మా ఊరికిరా జోలెనిండ ధాన్యం దొరుకుతది...

"మీ ఊరికి రేపస్త పటేల" అని కాలనీదిక్కు నడుస్తున్నాడు. కొండయ్య తనూరి దిక్కెళ్ళాడు.

గేటు దగ్గరికెళ్ళగానే సెక్యూరిటీ గార్డాపాడు రాజమల్లును...

తన ఖాళీజోలె చూపి అతని కాళ్ళావేళ్ళా పడి లోపలికెళ్ళాడు రాజమల్లు.

చెట్టు కింద చెప్పలు కుట్టుకుంటున్న 'మోచీ' వానితో గొడవ పడ్తున్న ఇంజనీర్ యువకున్ని చూసి ముఖం చిట్లించాడు. అర్థరూపాయి కోసమతడు పోట్లాడుతుండట మాతనికి బాగనిపించలేదు.

వరుసగా కట్టబడున్న రెండంతస్థుల బంగ్లాలు రెండు వరుసల మధ్య సిమెంట్‌రోడ్డు. చాలా మంది కార్లలోనో, స్కూటర్ల మీదనో పోవడం గమనించాడు.

ఓ బంగ్లా ముందాగి జగ్గూపాడు.

"అర్తి వాళ్ళమచ్చినం నాయనా? రాజన్నల వాన్నచ్చిన తండ్రీ! చారెడన్ని బియ్యం మెయ్యండ్రి బాబూ! పావలా పైసలియ్యండ్రి తల్లీ! కథలు జెప్పడనవ్వా నేను... నా అవ్వయ్యలు మీరే తండ్రులూ మీకు పుణ్యముంటది తల్లులూ... టక్ టక్ టక్‌మని జగ్గునూపుతూ వేడుకుంటున్నాడు రాజమల్లు

కుప్పన పంచ రుమాలు. అదే రంగు ధోతీ, గంగిరెద్దుకు తొడిగినట్టున్న ఆపారం అంగీ... భుజంపై వేలాడుతున్న పంచె, జోలెతో వున్న రాజమల్లు చుట్టూ మూగారు పిల్లలు. అతని ఆకారం, జగ్గచప్పడు కొత్తగా వుందివాళ్ళకు.

"రాజన్నలవాన్ని దొర్సానీ! అరొక్క కథ జెప్పత నేను. నన్నెల్లగొట్టుండ్రి తల్లీ! నాలుగిండ్లడుక్కుంటె జోలె నిండుతది.

అతడు మాట్లాడే యాను, ఢమరుకం ధ్వని పిల్లలకు వినోదాత్మకంగా వున్నాయి. "కంట్రీబూనిట్స్.. వీళ్ళకేమన్న పనుంటే కదా! అసలే బెగ్గర్స్‌ని లోపలికెందుకు రానిచ్చాడు హోమ్‌గార్డ్..." అంటూ కోపంగా ఇంట్లోంచి బయటకొచ్చాడు యజమాని... అతడా ఫ్యాక్టరీలో పర్సనల్ ఆఫీసర్.

"పనిలున్న పో..." అంది ఇంటావిడ బయట కొస్తూ....

"పోతున్న తల్లీ! అంత కోపమెందుకు?" అని

అక్కన్నుంచి వెళ్లి మరో బంగ్లా ముందునిల్చొని జగ్గనూపాడు రాజమల్లు.

పిల్లలాతన్ని వెంబడిస్తూనే వున్నారు.

"రాజన్నలవాన్ని తల్లీ! గంగదేవి కథ జెప్పత మల్లన్న దేవుని కథ జెప్పత కాటమరాజు కథ జెప్పత... అడుక్కునే వాళ్లమవ్వా! దానం చెయ్యండమ్మ..."

"పో...పో నీ కోసం వండివార్చినమా మల్లరాపో" కసురుకుందా ఇంటావిడ...

"అవ్వా! తల్లి... దొర్సాని" అని పిలిచాడు ఇంకో ఇంటిముందాగి...

"రాజన్నల వాన్నచ్చిన తల్లీ...! ఒక్క పాత ధోతి దానం జెయ్యండి... మా పోరగాండ్లకు చినిగిపోయిన లాగులియ్యండి... చారెడు బియ్య మెయ్యండి... బుక్కెడంత బువ్వన్నెయ్యండి... మీరంత పెద్దలోకులు తండ్రీ! పెద్దపెద్ద ఇంజనీర్లున్నరు, డాక్టర్లున్నరు, బాగ సదువచ్చి నోల్లున్నరు, మీకు మ్యాటర్లున్నయి, కార్లున్నయి. మీరు రైల్లపోతరు, గాలి మోటార్లల్ల పోతరు... మీ రాతలు మంచియి బావులూ! పాత బట్టపేగులుంటె దానం సెయ్యండి... కథలు చెప్పించుకుంటె చెప్పతం దొరా!

జగ్గావుతూ ఇంటివాళ్లందర్నీ దీవిస్తున్నాడు.

"మీ కొడుకులు కలెక్టర్లైతరు దొర, మీ బిడ్డలు రాణులైతరు, మీరంత పట్టువస్త్రాలు కట్టెటోల్లు... మీ ఫ్యాక్టరీ చల్లగుండాలె దొరా...!"

"నైట్ డ్యూటీ చేసొచ్చి పడుకుంటే ఇదో భాగోతం..."

కసురుకుంటూ బయటకొచ్చాడు జూనియర్ ఇంజనీయర్....

"ఒక్క పావలా ఇయ్యండి దొరా! 'అర్తి' వాళ్లం బాంచెను"

"అడుక్కోవడానికి సిగ్గెయ్యడం లేదా? పని చేసుకుంటేంది?"

"మీరిస్తరా దొర పని...?"

"అదుగో చెట్లకు పాదులు తవ్వు... రెండ్రూపాయలిస్త..."

"పుణ్యాత్ములే దొర మీరు... యాభై ఇచ్చేపనికి రెండ్రూపాయిలిస్తరు! మరి రోజూపనిస్తరా దొరా చేస్తం..."

"పో...పో... మాటకైతేం తక్కువలేదు..." రాజమల్లు చేతిలో పదిపైసలుంచి లోపలికెళ్ళాడతను...

పిల్లలు రాజమల్లును వెంబడిస్తూనే వున్నారు... నవ్వుతున్నారు.

మరో ఇంటిముందు నిల్చొని జగ్గాపాడు రాజమల్లు. ఆ చప్పుడు విని మొరిగిన ఊరకుక్కను కట్టెతో తరిమేశాడు.

"పరమేశుడూపే జగ్గుదొరా ఇది! జగ్గావుతూ బతికే రాజన్నలోన్ని ఆడబిడ్డ దీవెన అర్తివాని దీవెన న్నరు... అర్తి వాళ్లంటే ఆడబిడ్డలసొంతోల్లు దొరా!

న్యూజెర్సీ తెలుగు కళాసమితి, రాజాలక్ష్మి ఫౌండేషన్ (మద్రాసు), 'ఆంధ్రజ్యోతి' సచిత్ర వార పత్రిక సంయుక్తంగా నిర్వహించిన 1997 కథల పోటీలో కన్సొలేషన్ బహుమతి పొందిన కథ.

ఆడబిడ్డను, అర్తి వాళ్ల నేడ్పిస్తే ఆ ఇంటికరిష్టం దొరా! మేం దీవిస్తే పెద్దగైతరు. మాకు దానంజేత్తె పుణ్యమస్తది. మాకొక్క రూపాయిస్తే భగవంతుడు మీకు పది రూపాయలిస్తడు"

"ఏం? మీ దీవెనంత గొప్పదా?" నవ్వుతూ అన్నాడా ఇంటి యజమాని. "అర్తివాళ్లకు అడుక్కునే హక్కుంటుది దొరా...! అడిగినోల్లకు లేదనే జాతిగాదు మనది... కర్ణుడు కవచకుండలాలనే ఒలిసిచ్చిండు. శిబి చక్రవర్తి తన శరీరాన్నే కోసిచ్చిండు... బలి చక్రవర్తి తనే బలయిండు. ఇంటికొచ్చిన వాళ్లకు కాదనే జాతిగాదు దొరా మనది"

"అబ్బో కథలు కూడా బాగనే వచ్చే..." పావలా ఇచ్చి వెనుతిరగాడాతను...

ఇంటింటికి తిరుగుతున్నాడు రాజమల్లు... కొందరు కసురుకుంటున్నారు. కొందరు వెళ్లిపొమ్మంటున్నారు. కొందరు మళ్లీ రమ్మంటున్నారు... కొందరు పదిపైసలో, పావలో, పిడికెడు బియ్యమో దానం చేస్తున్నారు.

గడప దగ్గర కూచొని ఆడవాళ్ళు బిచ్చగాళ్ల గూర్చి మాట్లాడుకుంటున్నారు...

"వీళ్ళు లంగలుంటరు వదినె... నమ్మద్దు అడుక్కుంటాకొచ్చి దొంగతనాలు జేత్తరు"

"అవు వదినె... కుంచెరుకలోల్లయితె ఏదుంటది ఎత్తుకపోతరు... మొన్న ఎరుక సెప్పతనని వచ్చి నన్ను బుట్టలో పడేసి రెండు చీరలు కొంచవోయింది"

"వీళ్లను నమ్మద్దు అలా కనపడుతారు కాని మోసగాల్లుంటరు"

"కొందరైతే చిన్న పిల్లలను కూడా ఎత్తుకుపోతరు"

వాళ్ల మాటలు విని అక్కడికి వెళ్లకుండా కొన్నిండ్లు దాటివెళ్ళాడు రాజమల్లు. 'బి'టైపుక్వార్టర్లు దాటి 'సి' టైపులో తిరుగుతున్నాడు. అక్కడా అతనికి పెద్దగా దొరికిందేం లేదు... ఇప్పడాతని వెంట పిల్లల్లేరు.

ఓ ఇంటి ముందాగి జగ్గాపి పాటందుకున్నాడు

ఊపిరి పడితే బొర్ర పెరుగదీ! ఉపాసముంటే అప్ప తీరదే!

ఉమ్మిని మింగుతె దాహమారదీ! మాకు పెడితే మీకు పోదయ్యా!

దానంచేస్తే ధనం పెరుగు బాబూ...

"వెళ్లిపోతావా...? మెడలు పట్టి నూకన్నా..." బెదిరించాడా ఇంటి యజమాని.



కొందరు స్వల్పంగా దానం చేస్తున్నా మధ్యాహ్నం దాటినా అతనికి దొరికింది తక్కువే. ఏ ఒక్కరూ బుక్కెడన్నం పెట్టినవాళ్ళు లేరు.

ఏ పల్లెటూరి కెళ్ళినా తన జోలె, కడుపూ నిండే వనుకున్నాడు రాజమల్లు. స్కూటర్లతో, కార్లతో, అధునాతన సౌకర్యాలతో ఎంతో సుఖంతో బతుకుతున్నట్టు కనబడే ఆ కాలనీవాసులకు తనలాంటి వాళ్ళమీద ఎందుకంత ఏహ్యభావమో రాజమల్లు కర్థంకాలేదు. ఆ నాగరికులు తమను కనిపెంచిన తల్లిదండ్రులకైనా కూడు పెడుతారో లేదోనన్న దాతని కనుమానంగానే వుంది. కొండయ్య పటేలు మాటలు జ్ఞాపకం రాగా తనకేరోజు ఇంతే ప్రాప్తముందనుకున్నాడు.

ఇక వెళ్ళిపోదామనుకుంటుండగానే కొంతదూరంలో మరింత పెద్ద బంగ్లాలు కనబడ్డాయాతనికి. చీఫ్ ఇంజనీర్లు జెనరల్, డిప్యూటీ జెనరల్ మేనేజర్లు, డాక్టర్లు, చీఫ్ పర్సనల్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు, డాక్టర్లు లాంటి పైహోదాల వాళ్ళుండే 'డి' టైపు క్వార్టర్లవి. వాటి దిక్కునడుస్తూ రాజమల్లు కారు షెడ్లతో, పనిమనుషుల షెడ్లతో



రాజభవనాల్లా వున్న ఆ ఇండ్లలో తనకేమైనా దొరుకవచ్చనుకున్నాడు. ఓ క్వార్టర్ గేటు తీసుకొని లోపలికెళ్ళాడు.

జగ్గూవుతూ ఎంతరుస్తున్నా ఎవరూ బయటకు రాలేదు.

కాళ్ళు నొప్పెడుతుంటే అక్కడే కూలబడ్డాడు. కొద్దిసేపాగి లేచి బయటకెళ్ళబోతున్నాడు. అప్పుడే ఇంట్లోంచి బయటకొచ్చిన ఆ ఇంటి యజమానురాలు "దొంగ... దొంగ..." అనరిచింది గట్టిగా...

ఆ అరువులు విని ఇంటివెనుకున్న పనిమనిషి చుట్టు క్వార్టర్ల వాళ్ళంతా ఉరికొచ్చారు. మెడలో గొలుసు తీసి ముందు రూంలో పెట్టి స్నానానికెళ్ళాను. స్నానం చేసొచ్చేసరికది లేదు. వీడు త్వరత్వరగా వెళ్తున్నాడు అందా ఇంటావిడ.

"నేను వాకిట్లనే కూసున్న... ముందటర్రలకు పోనేలేదు... నేను దొంగను కాదమ్మా... నా జోలె చూడుండ్రి" రాజమల్లు ఎంత మొత్తుకుంటున్నా ఎవరూ వినడంలేదు.

"నువ్వు దొంగవు కాకుంటే గేటు తీసుకొని లోపలికెందుకొచ్చినవు..."?

ఎవరో ఫోన్ చేయగా ఇంటి యజమాని కార్లో వచ్చాడు.

"మంచి మాటతో తీసిన గొలుసియ్యి. లేకుంటే పోలీసులకు పట్టిస్తాను..."

"లేద్దొరా నేను వాకిట్లనే నిల్చున్న దొరా?" మొత్తుకుంటున్నాడు రాజమల్లు. అతని జోలంతా వెతికినా గొలుసు దొరకలేదు. అయినా అతన్ని దొంగనే అంటున్నారు. "వీళ్ళను నమ్మొద్దు... ఎక్కడో దాచుంటాడు. పోలీసులను పిలిస్తే తిక్క కుదురుద్ది"

ఫోన్‌చేసి పోలీసులను రప్పించారు వాళ్ళు...

రాజమల్లను విపరీతంగా కొట్టి జీపులో వేసుకొని స్టేషన్‌కు తీసుకెళ్ళారు.

అక్కడా అతని ఒళ్ళు హూనం చేశారు. రాజమల్లు కొడుకులకీ విషయం తెల్సింది. పోలీసుల కాళ్ళావేళ్ళా పడ్డారు. నాలుగువందలు ఖర్చుచేసి తండ్రిని విడిపించారు.

స్టేషన్ బయట నిల్చున్న రాజమల్లు కనుగుడ్ల నిండా నీళ్ళున్నాయి. కడుపునిండా దుఃఖముంది. పిడికెడు మట్టిని చేతిలోకి తీసుకున్నాడు. ఆ కాలనీ దిక్కు చూస్తూ ఎగజల్లాడు.

"అర్తివాళ్ళను కొట్టినూరుకు పుట్టగతులుండయి. నా ఉసురు తలుగకమానది. ఈ పట్నం నాశినమైతది. ఈ బంగ్లాలల్ల దీపం బెట్టకుంటైతది" శపిస్తూ వలవల ఏడుస్తూ వెళ్ళిపోతున్నాడు రాజమల్లు.

ఆ పట్టణవాసులు తమ మూలాలను మరిచిపోయి ధన 'దాహం'తో తపించిపోతున్నట్టుగా రాజమల్లు కళ్ళముందు కదులుతున్నారు.

రాజమల్లు లాంటివాళ్ళ ఉసురు తగలడం వల్లనంటారు కొందరు. అక్కడుద్యోగులు తమ పునాదులనే మరిచిపోవడం వల్లనంటారు మరికొందరు. అక్కడి కార్మికులకు తాము కార్మికులమన్న స్పృహ కొరవడడం వల్లనంటారు మరికొంతమంది. అధికారుల్లోని అవినీతి, పాలకుల నిర్లక్ష్యం కారణమేదైనా కావచ్చు. కర్ణుడి చావుకూ అన్నీ కావచ్చు.

ఆ ఫ్యాక్టరీ సిక్ యూనిట్‌గా మారింది. నాలుగేళ్ళ తర్వాత వచ్చిన ప్రభుత్వం దాన్ని ఖాయిలాపడ్డ పరిశ్రమగా ప్రకటించింది. అప్పట్నుంచి ఉద్యోగుల గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయి. కొంతమంది వేరే ఉద్యోగాలను వెతుక్కుంటూ అక్కన్నుంచి వెళ్ళిపోయారు. మరికొందరు వెళ్ళిపోవడానికి ప్రయత్నిస్తున్నారు... ఇప్పుడు చాలా ఇండ్లు ఖాళీగా వున్నాయి. అక్కడున్న వాళ్ళ ముఖాల్లో ఉద్యోగభద్రత గూర్చిన ఆందోళనుంది. ఇప్పుడెవర్ని కదిపినా వర్షించే మేఘాల్లాగే వున్నారు వాళ్లు.

ఆ ఫ్యాక్టరీ త్వరలోనే మూతపడటానికి సిద్ధంగా వుంది. ◆



**ఇంటిదొంగ**

అమృతాసింగ్ ఈ మధ్య డైమండ్లతో పొదిగిన తన వాచీ, కొన్ని నగలు (మొత్తం కలిపి రూ. 2.39 లక్షల విలువ) పోయాయంటూ పోలీసులకు ఫిర్యాదిచ్చింది. తీరా చూస్తే నగలు ఇంటిలోని ఓ మూల అల్మారాలో ఓ చిన్న పర్సులో దొరికాయట.


**రూ. 2,50,000/-లు విలువగల బహుమతులు గెలుపొందండి**

| | | |
|---|---|---|
| | | |
| | | |
| | | |

ప్రత్యేక బహుమతి:
హీరో హోండా
మోటార్ సైకిల్ (లేదా)
చేతక్ స్కూటర్ (లేదా)
కలర్ టి.వి.

| | | |
|---|---|---|
| 8 | 13 | 6 |
| 7 | 9 | 11 |
| 12 | 5 | 10 |

కన్సోలేషన్ బహుమతులు:
మ్యూచువల్ బెనిఫిట్ పథకము క్రింద కెమేరా, టూ-ఇన్-వన్, ట్రాన్సిస్టర్, శారీస్, రిస్ట్‌వాచ్.

పై ఉదాహరణలో వలె కాంపిటీషన్ పోస్ట్‌కార్డు/ ఇన్‌లాండ్ / ఎన్వెలప్‌పై 9 గడులను గీయండి. 7 నుండి 15 వరకు గల అంకెలను వాడుతూ నిలువుగా, అడ్డముగా, ఏటవాలుగా ఎటు కూడినా మొత్తం 33 రావాలి. ఒక అంకెను ఒక్కసారి మాత్రమే వాడాలి. కాంపిటీషన్ పోస్ట్‌కార్డు/ ఇన్‌లాండ్/ ఎన్వెలప్‌పై మీ ఎంట్రీ వ్రాసి ఆర్డినరీ మెయిల్ ద్వారా 10 రోజులలో పంపండి. ముందుగా చేరిన 10 ఎంట్రీలకు టైటాన్ రిస్ట్ వాచ్ గోల్డెన్ చైన్ బహూకరించబడును.

**SANDEEP TRADERS** (503)
POST BOX No: 14, NEW DELHI-110 008